ఫార్మాసిటీని రద్దు చేయాలి

తాటిపర్తిలో రైతులతో మాట్లాడుతున్న కవుల సరస్వతి

యాచారం, అక్టోబర్ 3: కాలుష్యం వెదజల్లే ఫార్మాసిటీని వెంటనే రద్దు చేయాలని సామాజికవేత్త కవుల సరస్వతి అన్నారు. ఈ సందర్భంగా తాటిపర్తిలో గురువారం రైతుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలోని తాటిపర్తి, మేడిపల్లి, కుర్మిద్ద, నానక్‌నగర్ గ్రామాల్లో ఏర్పాటు చేసే ఫార్మాసిటీని రద్దు చేయాలన్నారు. అధికార పార్టీ నాయకులు రైతులను ఎంత మభ్యపెట్టినా నాలుగు గ్రామాలకు సంబంధించిన 2500 ఎకరాల పట్టా భూమిని ఫార్మాకు ఇచ్చేదిలేదని స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు రైతుల భూములను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రైతులకు రైతుబంధు, రైతుబీమా వర్తించేలా చూడాలన్నారు. ఫార్మా భూ నిర్వాసితులతో పాటు భూమిని నమ్ముకున్న కూలీలకు సైతం ప్రభుత్వం తగిన ఉపాధి కల్పించాలన్నారు. అధికారంలోకి వస్తే ఫార్మాను రద్దు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు నేడు మాట మార్చడం సరి కాదన్నారు. ఫార్మా సిటీని రద్దు చేయాలని మరోసారి కోర్టుకు వెళ్తామన్నారు. ఫార్మాసిటీని రద్దు చేసే వరకు ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సామ నిరంజన్, రైతులు, గ్రామస్తులు తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్, అక్టోబర్ 3 : ఎస్సీ విద్యార్థులు పోస్ట్-మెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం 2024-25కు ఎస్సీ విద్యార్థుల ఉపకార వేతనాల దరఖాస్తులు, మంజూరు విషయంలో నూతన గైడ్‌లైన్లను పొందుపరిచినట్లు చెప్పారు. ఇందు కోసం మూడు దశల్లో ప్రక్రియ ఉంటుందన్నారు. ముందుగా ఎస్సీ విద్యార్థి మొదటి దశలో డెమో అతెంటికేషన్ చేయాలన్నారు. విద్యార్థి ఈ పాస్ వెబ్‌సైట్‌లో ఫ్రెష్/రెన్యువల్ రిజిస్ట్రేషన్‌లో భాగంగా తన ఆధార్‌కార్డు నంబర్‌ను సమర్పించి పదో తరగతి వివరాలతో మ్యాచ్ చేసుకోవాలన్నారు. ఈ వివరాలు మ్యాచ్ కాని పక్షంలో ఆధార్ వివరాలను సమీప మీ సేవ కేంద్రంలో అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. రెండో దశలో మీసేవ కేంద్రంలో బయోమెట్రిక్ చేయాలన్నారు. మూడో దశలో సంబంధిత ధ్రువపత్రాల ను అప్‌లోడ్ చేసి ఉపకార వేతన వివరాలతో దరఖాస్తును నమోదు చేయాలన్నారు. మూడు దశల్లో విద్యార్థి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసి సదరు దరఖాస్తును తదుపరి ప్రక్రియ కోసం సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేయాలన్నారు. ఈ ప్రక్రియ అంతా ఈ పాస్ వెబ్‌సైట్‌లో ఉన్నట్లు తెలిపారు. రంగారెడ్డిజిల్లాలోని సంబంధిత కళాశాలల యాజమాన్యాలు ఎస్సీ విద్యార్థులకు తగు సూచనలు చేసి వారు రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్కాలర్‌షిప్ రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈ ఏడాది డిసెంబర్ 31లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. షెడ్యూల్డ్ కులాల విద్యార్థిని/విద్యార్థులకు 2024-25 సంవత్సరం నుంచి ఆదాయ పరిమితి రూ.2లక్షల నుంచి రూ. 2.50లక్షలకు పెంచామన్నారు. ఇతర వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయం కొంగరకలాన్, రంగారెడ్డిజిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- రైతులు ఇబ్బందులు పడకుండా వసతులు కల్పించాలి
- రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- సంబంధిత అధికారులు, మిల్లర్లతో సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, అక్టోబర్ 3(నమస్తే తెలంగాణ) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీగా అవసరమైన వసతులు కల్పించాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సంబంధిత అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధాన్యం కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ గా అవసరమైన వసతులు కల్పించాలన్నారు. రైతులు ధాన్యం తీసుకొచ్చిన వెంటనే తూకం వేయించాలని అధికారులకు సూచించారు. సన్నరకం వరి, ముతక రకాలను వేర్వేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేరు చేయాలన్నారు. సన్నరకం వరి, ముతక రకం వరిని వేర్వేరుగా ట్యాగ్ చేసిన రైస్ మిల్లులకు జారీ చేసిన కేటాయింపు ఆధారంగా డేటా ఎంట్రీని రోజువారీ ప్రాతిపదికన చేయాలన్నారు. కేంద్రాల వద్ద సరిపడే సంఖ్యలో హమాలీలు సేవలందించేలా ఏర్పాట్లు ఉండాలని, రైస్ మిల్లుల వద్ద కూడా ధాన్యం లోడ్లతో కూడిన లారీలు నిలిచి ఉండకుండా ఎప్పటికప్పుడు ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునేలా పకడ్బందీగా పర్యవేక్షించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సన్నరకం, ముతక రకానికి సంబంధించి సంబంధిత అధికారులకు అవసరమైన ధ్రువీకరణ కోసం అవసరమైన శిక్షణ ఇస్తామన్నారు. టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూనికలు, పొట్టు రిమూవర్, తేమ యంత్రం తదితర అన్ని మౌలిక సదుపాయాలను ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, సివిల్ సప్లయ్ జిల్లా అధికారి శ్రీనివాస్, సివిల్ సప్లైస్ డీఎం గోపీకృష్ణ, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నర్సింగ్ రావు, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి మహ్మద్ రియాజ్, డీసీవో సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి ప్రణాళిక రూపకల్పనపై అవగాహన

రంగారెడ్డి, అక్టోబర్ 3(నమస్తే తెలంగాణ): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 2025-26 సంవత్సరానికి సంబంధించిన ప్రణాళిక రూపకల్పనపై రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక అధికారులకు పలు సూచనలు చేశారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి గ్రామ పంచాయతీ, మండలాలు, జిల్లా వారీగా ఉపాధి హామీ పథకం ప్రణాళికలను రూపొందించాలన్నారు. గతేడాది ఉపాధి హామీ పథకంలో సాధించిన ప్రగతిపై అధికారులను కలెక్టర్ ప్రశంసించారు. ఉపాధిహామీ పథకం ప్రణాళిక రూపకల్పనపై డీఆర్డీవో శ్రీలత అవగాహన కల్పించారు. అవగాహన సదస్సులో అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేశ్‌మోహన్, ఏపీడీలు, ఎంపీడీవోలు, పోగ్రాం అధికారులు, అదనపు ప్రోగ్రాం అధికారులు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 3: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు మొదటి, మూడు, ఐదు, ఏడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను ఈ నెల 22వ తేదీ నుంచి, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగా పరీక్షలను ఈ నెల 23వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీలతో పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

బీఫార్మసీ ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 3: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఫార్మసీ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) ఏడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు మెమోలను మూడువారాల తరువాత సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 8వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 8వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

వికారాబాద్, అక్టోబర్ 3: కురుస్తున్న వర్షాలతో రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి పంటలను కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం, తాండూరు, కోఆర్డినేటర్ లక్ష్మణ్, వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, ఏడీఏ స్వరూపా రాణి, మండల వ్యవసాయ అధికారి జ్యోతి, వ్యవసాయ విస్తరణ అధికారి కావ్య సంయుక్తంగా వికారాబాద్ మండల పరిధిలోని జైదుపల్లిలో పత్తి, కంది పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పత్తి పంటలో వడల తెగులు, పిందె రాలడాన్ని గమనించామన్నారు. వడల తెగులు నివారణకు లీటరు నీటికి మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్, ఒక గ్రాము కార్బన్డాసిమ్ మిశ్రమాన్ని మొక్క మొదలు వద్ద చుట్టూ నేలంతా తడిచేలా చేయాలన్నారు. పొలంలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు కిష్టయ్య, శంకరయ్య, నర్సింహులు, రాములు, ఎం. నర్సింహులు, వెంకటయ్య, జి.నర్సింహులు, రమేశ్‌రెడ్డి, జి.కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో సర్వేను పరిశీలిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ప్రారంభం

- పైలెట్ ప్రాజెక్టుగా కొడంగల్ మున్సిపల్‌లోని 8వ వార్డు ఎంపిక
- సర్వే కార్యక్రమాన్ని పరిశీలించిన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, అక్టోబర్ 3 : ప్రతి ఒక్కరి గుర్తింపు కోసం ఆధార్ కార్డు ఉన్నట్టే ప్రతి కుటుంబానికి ఒక డిజిటల్ కార్డు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని, పైలెట్ ప్రాజెక్టుగా కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో సర్వే ప్రారంభించినట్లు వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో ప్రారంభించిన కుటుంబానికి ఒకే డిజిటల్ కార్డు కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. వార్డులో మొత్తంగా 190 కుటుంబాలున్నాయని.. రెండు, మూడు రోజుల్లో సర్వే పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, తహసీల్దార్ విజయ్‌కుమార్, రెవెన్యూ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పగిడిపల్లిలో..

యాలాల, అక్టోబర్ 3: మండల పరిధిలోని పగిడిపల్లిలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇంటింటి సర్వేను సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ఎంపీడీవో పుష్పలీల, తహసీల్దార్ అంజయ్య, ఎంపీవో యాదయ్యలతో కలిసి ప్రారంభించారు. అనంతరం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి రోజూ 40 కుటుంబాలను సర్వే చేసేలా టార్గెట్ రూపొందించుకొని 5 రోజుల్లో పైలెట్ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వ పరంగా లభించే అన్ని సంక్షేమ పథకాలకు ఈ కార్డు ఉపయోగపడుతుందన్నారు.

కుడుగుంటలో సర్వే

మర్పల్లి, అక్టోబర్ 3: మండల పరిధిలోని కుడుగుంటలో ఫ్యామిలీ డిజిటల్ సర్వేను అదనపు కలెక్టర్ శ్రీధర్ ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు మండల పరిధిలోని కుడుగుంటను పైలెట్ గ్రామంగా ఎంపిక చేశామన్నారు. అధికారులు వచ్చిన సమయంలో కుటుంబ వివరాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సురేశ్ యాదవ్, సీనియర్ నాయకుడు రాములు యాదవ్, కృష్ణారెడ్డి, రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు..

కొండారెడ్డిపల్లికి సోలార్ వెలుగులు

కొడంగల్, అక్టోబర్ 3: సోలార్‌తో విద్యుత్ సరఫరా చేపట్టేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొడంగల్ మున్సిపల్ పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామాన్ని ఎంపి క చేసింది. గురువారం టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషార్ ఫారుఖీ, కలెక్టర్ ప్రతీక్‌జైన్‌లు గ్రామాన్ని సం దర్శించి అక్కడ పరిసరాలను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి ప్రతి ఇంటికి సోలార్ ద్వారా వి ద్యుత్ అందించేందుకు కొండారెడ్డిపల్లిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందుకోసం రూ.10కోట్ల వరకు వెచ్చించే అవకాశం ఉందన్నారు. గ్రామంలోని 153 ఇండ్లకు సోలార్ విద్యుత్ సౌకర్యాలు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీజీ రెడ్‌కో చైర్మన్ అనీల, టీజీఎస్‌పీడీసీఎల్ సీఈ ఆనంద్, ఎస్ఈ సంజీవ్‌రెడ్డి, ఏడీఈ నవీన్‌కుమార్, ఏఈ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు జాగ్రత్తలు తీసుకోవాలి

వికారాబాద్, అక్టోబర్ 3: ఖరీఫ్ 2024-25 వరి ధాన్యం సేకరణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయం నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంత కుమారీలతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఖరీఫ్ 2024-25 సీజన్ వరి ధాన్యం సేకరణ, డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల ఉపాధ్యాయ నియామక ప్రక్రియపై కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఖరీఫ్ 2024-25 వరి ధాన్యం సేకరణలో భాగంగా రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా మౌలిక సదుపాయాలు సమకూర్చాలని ఆదేశించారు. వరి ధాన్యం సేకరణ కేంద్రాల వద్ద తాగునీరు, టెంట్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 9వ తేదీన లాల్ బహదూర్ స్టేడియంలో ఎంపికైన ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేస్తామని సూచించారు. వీసీలో ఎస్పీ నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీసీఎస్‌వో మోహన్ బాబు, డీఎంఎస్ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కొండంత గ్యాస్ రాయితీ..

రాయితీ జమకాక లబ్ధిదారుల ఆందోళన

గ్యాస్ ఏజెన్సీలు, మండల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒకటైన మహాలక్ష్మి పథకం దరఖాస్తుదారులను కరుణించడం లేదు. ఆ గ్యాస్ రాయితీ కొంది మందికే జమ అవుతుండడంతో మిగిలినలబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. తమకు ఎందుకు వర్తించడంలేదని గ్యాస్ ఏజెన్సీలు, మండల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

బొంరాస్‌పేట, అక్టోబర్ 3 : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయం లో ప్రజలకు అనేక హామీలను ఇచ్చింది. అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని భరోసా ఇచ్చింది. అందులో భాగంగానే రూ.500 లకే వంటగ్యాస్ అందించేలా మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నది. అయితే దరఖాస్తు చేసుకున్న చాలామందికి గ్యాస్ రాయితీ జమ కావడం లేదు. కొందరికేమో సిలిండర్ తీసుకున్న నాలుగైదు రోజుల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో క్రెడిట్ అవుతున్నది. రాయితీ జమకాని వారు మండల కార్యాలయాలు, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్నారు. మం డల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రజాపాలన కౌంటర్లు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అందని వారి నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నారు. మళ్లీ దరఖాస్తు చేసుకున్నా పథకాలు అమలు కావడం లేదని పేదలు వాపోతున్నారు.

జిల్లాలో 1,65,108 గ్యాస్ కనెక్షన్లు

వికారాబాద్ జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన 21 ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి పరిధిలో 1,65,108 కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో జనరల్ కనెక్షన్లు 69,902, దీపం కింద 35,193, పీఎం ఉజ్వల కనెక్షన్లు 38,753, సీఎస్ఆర్ కనెక్షన్లు 21,260 ఉన్నాయి. వీటిలో 1,19,591 గ్యాస్ కనెక్షన్లు రూ.500లకే సిలిండర్ పథకానికి అర్హత సాధించాయి. ఆగస్టు నెలాఖరు నాటికి లబ్ధిదారుల ఖాతాల్లో గ్యాస్ రాయితీ కింద రూ. 1.92 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. సిలిండర్ పూర్తి ధర రూ.872 వినియోగదారుడు ఏజెన్సీకి చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వమిచ్చే రాయితీ రూ. 500 పోను మిగతా రూ.372 లబ్ధిదారుల ఖాతాల్లో జమ కావాల్సి ఉన్నది. అయితే ఒక్కో కుటుంబం ఏడాదికి సగటున ఆరు సిలిండర్లను వినియోగిస్తుంటుంది. రాయితీ జమ కాకపోవడంతో ఏడాదికి 2 వేల రూపాయలకు పైగా తాము నష్టపోతున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాయితీ జమ కావడం లేదు..

బొంరాస్‌పేటలో నాకు గ్యాస్ కనెక్షన్ ఉన్నది. రూ.500లకే సిలిండర్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం తో దరఖాస్తు చేసుకున్నా. డెలివరీ బాయ్‌కు రూ.872 చెల్లించి సిలిండర్ తీసుకున్నా. రాయితీ మాత్రం ఇంకా రాలేదు.

-సాలీబాయి, దేవులానాయక్‌తండా

ఈ-కేవైసీ చేయించుకోవాలి..

గ్యాస్ కనెక్షన్ ఉన్న వారు ఈ-కేవైసీ చేయించుకోకపోతే రాయితీ జమ కాదు. అదేవిధంగా రాయితీ జమ కాని వారు మండల కార్యాలయాల్లోని ప్రజా పాలన కౌంటర్లలో దరఖాస్తు చేసుకోవాలి. జిల్లాలో 1,19,591 గ్యాస్ కనెక్షన్లకు రాయితీ జమ అవుతున్నది. ఇప్పటి వరకు లబ్ధిదారుల ఖాతాల్లో రూ. 1.92 కోట్లు రాయితీ సొమ్ము జమ చేశాం.

-బాబూమోహన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

రాయితీ జమయ్యేలా చూడాలి..

అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని ప్రభుత్వం చెప్పింది. రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నా. పూర్తి ధర చెల్లించి సిలిండర్ తీసుకుంటున్నా సబ్సిడీ మాత్రం బ్యాంకు ఖాతాలో జమ కావడంలేదు.

-మంగలి అనురాధ, రేగడిమైలారం

దరఖాస్తు చేసినా రావడం లేదు..

రూ.500 లకే సిలిండర్ కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేశా. డెలివరీ బాయ్‌కు పూర్తి మొత్తం చెల్లించి సిలిండర్ తీసుకున్నా. రాయితీ మాత్రం రావడంలేదు. ప్రభుత్వం చెప్పినట్లు రాయితీ వస్తే కొంత ఆసరాగా ఉంటుంది. అధికారులు పేదలకు మేలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

-శాంతీబాయి, దేవులానాయక్‌తండా

అన్ని సక్రమంగానే ఉన్నాయి..

సంక్షేమ పథకాల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేశా. అన్నీ సక్రమంగానే ఉన్నాయి. అయినా రెండు నెలలుగా సిలిండర్ రాయితీ డబ్బులు మాత్రం నాఖాతాలో జమ కావడంలేదు. అధికారులను అడిగినా సరైన సమాధానం లేదు.

-హన్మంతు, లింగన్‌పల్లి

కొత్త చైర్‌పర్సన్‌గా పండుగల జయశ్రీ

- పెద్దఅంబర్‌పేటలో బాధ్యతల స్వీకరణ
- మద్దతు ఇచ్చిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు

ఎన్నికైన ధ్రువపత్రం, మద్దతు తెలిపిన కౌన్సిలర్లతో చైర్‌పర్సన్ పండుగల జయశ్రీ

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 3: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా పండుగల జయశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం లోని వార్డు కార్యాలయంలో చేవెళ్ల ఆర్డీవో, ప్రత్యేకాధికారి పీ సాయిరాం ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ ఎన్నిక ని ర్వహించారు. గతంలో పని చేసిన చైర్‌పర్సన్ చెవుల స్వప్నకు వ్యతిరేకంగా 17 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై గతనెలలోనే బలపరీక్ష నిర్వహించగా.. అవిశ్వాసం నెగ్గింది. దీంతో స్వప్నను చైర్‌పర్సన్ పదవి నుంచి తొలగించారు. ఖాళీ అయిన చైర్‌పర్సన్ పదవికి ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రకారం గురువారం ఎన్నిక నిర్వహించారు. చైర్‌పర్సన్ కోసం పండుగల జయశ్రీ పేరును కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ ప్రతిపాదించగా.. కౌన్సిలర్ పాశం అర్చన బలపరిచారు. పోటీ లేకపోవడంతో జయశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని సాయిరాం వెల్లడించారు. సమావేశానికి వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డి సహా మొత్తం 21 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. మాజీ చైర్‌పర్సన్‌తోపాటు మరో ఇద్దరు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. ఎన్నిక అనంతరం పెద్దఅంబర్‌పేటలోని మున్సిపల్ కార్యాలయం లో పండుగల జయశ్రీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ.. అన్నివర్గాల మద్దతుతో చైర్‌పర్సన్‌గా ఎన్నికైనట్టు తెలిపారు. పాలకవర్గానికి ఉన్న కొద్ది సమయంలోనూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఏకగ్రీవ ఎన్నిక అనంతరం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్ దిగిపోయి.. మళ్లీ అదే పార్టీకి చైర్‌పర్సన్ ఎన్నికయ్యారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న ఒంటెద్దు పోకడలు నచ్చకనే అవిశ్వాస తీర్మానానికి ఆదినుంచి నలుగురం మద్దతుగా నిలిచినట్టు బీఆర్ఎస్ కౌన్సిలర్లు తెలిపారు. మున్సిపాలిటీ మరింత అభివృద్ధి కోసం మార్పు కావాలని భావించామని, అందుకు తగ్గట్టుగా జయశ్రీకి మద్దతు తెలిపామని కౌన్సిలర్లు తొండాపు రోహిణిరెడ్డి, పాశం అర్చన తెలిపారు.

బీఆర్ఎస్ కౌన్సిలర్ల మద్దతు

కాంగ్రెస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్నపై ఇతర పార్టీల మద్దతుతో హస్తం పార్టీకి చెందిన కౌన్సిలర్లు పటాకులు కాల్చి సంబురాలు చేశారు.

బతుకమ్మా..నీకెన్ని కష్టాలమ్మా..

జాపాల చెరువులో నీళ్లులేకపోవడంతో రంగురంగు పూలతో దర్శనమిస్తున్న